క్లుప్తంగా

విజయ గణపతికి అభిషేకాలు



కలశాలతో పూజలు చేస్తున్న రుత్వికులు

సారవకోట: మండలంలోని అవలింగిలో ఉన్న విజయ గణపతి ఆలయంలో స్వామివారికి 108 కలశాలతో రుత్వికులు జానీ ప్రసాద్ శర్మ ఆదివారం అభిషేకం నిర్వహించారు. శని వారం నుంచి జరుగుతున్న ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో హోమం, ప్రత్యేక, విశేష పూజలతో పాటు అభిషేకం చేపట్టారు. సోమవారంతో ఉత్సవాలు ముగియనున్న సందర్భంగా మహా అన్న సంతర్పణ చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస గ్రామ విలేజ్ హెల్త్ క్లీనిక్ వద్ద విశాఖపట్నంకు చెందిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ పాల్, హారిక ఆధ్వర్యంలో సుమారు 200 మందికి తనిఖీలు చేశారు. అవసరమైన వారికి ఉన్నత చికిత్సలు కోసం వైజాగ్ రిఫర్ చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడేల రాజారావు, తాడేల వెంకటరమణ, తొత్తడి వైకుంఠరావు, బెవర రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి



డాక్టర్ చాపర సుధాకర్‌ను అభినందిస్తున్న నాయకులు

ఆమదాలవలస: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ చాపర సుధాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మెంబర్‌గా ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవి కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఎంపిక చేసిన పదవికి తగు న్యాయం చేస్తూ వైద్య విద్య అభివృద్ధికి, మెడికల్ కాలేజీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీజామృతం తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ దుర్గాప్రసాద్

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం ఉపయోగించడం వల్ల విత్తనంకు రక్షణగా ఉంటుందని మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బడ్డుమర్రి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతం తయారీ, ప్రకృతి సేద్యంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతం ఉపయోగించడం వలన గాలి ద్వారా సంక్రమించే వ్యాధులు, భూమి నుంచి సంక్రమించే వ్యాధుల నుంచి విత్తనం రక్షణ పొందుతుందన్నారు. అనంతరం బీజామృతం తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో భీమారావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

శ్రీకాకుళం కల్చరల్: వృద్ధులను ఆదరిస్తూ ప్రేమగా చూడటం కుటుంబ సభ్యుల బాధ్యతని వక్తలు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నగరంలోని శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు మాట్లాడుతూ వేధింపులకు గురవుతున్న వృద్ధులను గుర్తించి వారి కోసం సీనియర్ సిటిజెన్ హోం నిర్మించేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంఘ అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పెద్దలను గౌరవించేలా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సహాధ్యక్షులు సోమసుందరరావు, పి.నరసింహమూర్తి, పి.ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.

అన్నదాత అవస్థలు



పోలాకి ఓపెన్ హెడ్ చానల్‌పై చోడవరం వద్ద ధ్వంసమైన షట్టర్లు

- మరమ్మతులకు నోచుకోని షట్టర్లు
- ఖరీఫ్ సమీపిస్తున్నా స్పందించని అధికారులు

నరసన్నపేట: సాగునీటి సరఫరాలో అత్యంత కీలకమైన షట్టర్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సాగునీటిని ఎగువ భూములకు తరలించాలన్నా.. దిగువ భూములకు సక్రమంగా నీరు అందించాలన్నా షట్టర్లు ఎంతో అవసరం. అయితే నరసన్నపేట నియోజకవర్గంలో పదేళ్లకు పైగా నీటి కాలువలపై ఉన్న షట్టర్లకు మరమ్మతులు చేయడం లేదు. వంశధార మెయిన్ చానల్(ఎన్‌బీసీ) వంటి కాలువలపై అత్యవసర రీత్యా కొన్నింటిని అప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి నీటిని రెగ్యులర్ చేస్తున్నా, మిగిలిన షట్టర్ల నిర్వహణ మాత్రం చేపట్టడం లేదు. దీంతో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో తుప్పు పడుతున్నాయి. ప్రధానంగా నరసన్నపేట మండలంలోని పోలాకి, మబగాం ఓపెన్ హెడ్ చానల్, వంశధార పరిధిలో ఉన్న 3ఆర్ నడగాం, సెవెన్ ఆర్ ఉర్లాం, లెవెన్ ఆర్ కిల్లాం, 8 ఆర్ దేవాది, టెన్ ఆర్ గొట్టిపల్లి, మేఘవరం చానల్ వంటి ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటికి ఆనుకొని పిల్ల కాలువలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ చానల్స్‌లో నీటి రెగ్యులేషన్ కోసం ఏటా షట్టర్లు మరమ్మతులు చేస్తుండాలి. అలాంటిది కోర్టులో కేసులు ఉన్నాయనే నెపంతో అధికారులు మిన్నుకుంటున్నారు.

రైతులు ఇబ్బందులు పడుతున్నారు



సాగునీటి సరఫరాలో ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం కాలువల్లో నీటి రెగ్యులేషన్ సక్రమంగా జరగకపోవడమే. నీటి రెగ్యులేషన్ జరగాలంటే షట్టర్లు పటిష్టంగా ఉండాలి. ప్రస్తుతం అన్నీ తుప్పు పట్టి ఉన్నాయి. కొన్ని దగ్గర్ల అసలు లేవు. దీంతో రైతులు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వంశధార ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలి.

– దుంపల భాస్కరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పోలాకి మండలం



రెల్లివలస వద్ద వంశధార చానల్‌పై తుప్పపట్టిన షట్టర్

శివారు భూములకు నీరు అందేనా..?

షట్టర్లు ఎక్కడికక్కడ శిథిలం కావడంతో కాలువ శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా నరసన్నపేట మండలంలో లుకలాం, పోతయ్యవలస, మడపాం తదితర గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. పోలాకి మండలంలోని దండులక్ష్మీపురం, ప్రియాగ్రహారం, రేగుపాడు, మగతపాడు, కొడూరు, సుసరాం, గుప్పడిపేట శివారు గ్రామాలు ఉన్నాయి. అలాగే జలుమూరు, సారవకోట మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. ఈ ఖరీఫ్‌కు అయినా సాగునీరు వారికి అందుతుందని రైతులు ఆశించారు. అయితే షట్టర్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



భూములకు సక్రమంగా సాగునీరు అందాలంటే కాలువలపై ఉన్న షట్టర్లు ఎంతో ముఖ్యం. కానీ వాటినే అధికారులు పట్టించుకోవడం లేదు. దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి మరమ్మతులు జరగడం లేదు. రైతులు డిమాండ్ చేస్తే సీఐడీ కేసు ఉంది మేము ఏమీ చేయలేం అని ఇంజినీర్లు తప్పించుకుంటున్నారు.

– పోలాకి నర్సింహమూర్తి, సర్పంచ్, ఉర్లాం

కోర్టులో కేసులు ఉన్నాయి

షట్టర్ల మరమ్మతులు జరగకపోవడం వలన నీటి రెగ్యులేషన్ సమస్యగా ఉంది. అయితే గతంలో షట్టర్ల వ్యవహారంలో సీఐడీలో కేసు నమోదు కావడం.. అది దర్యాప్తులో ఉండడం వలన వాటిని అధికారులు ముట్టుకోలేకపోతున్నారు. దీంతో నీటి రెగ్యులేషన్ చాలా కష్టంగా మరింది. జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రాధాన్యతా షట్టర్లు అయినా మరమ్మతులు జరిగేలా చూస్తాం.

– శిమ్మ చంద్రశేఖర్, కిల్లాం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్

సంక్షేమాన్ని గాలికొదిలేశారు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ చేసిన అభివృద్ధి గోరంత, చెప్పుకుంటున్నది కొండంతలా ఉందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలే బహిరంగంగా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చదువు కోసం విమర్శించే స్థాయి కూన రవికుమార్‌కు లేదన్నారు. ముందు కూన చదివిన ఇంజినీరింగ్ సర్టిఫికెట్లు ఎక్కడివో తేల్చుకోవాలని సూచించారు. ఇప్పటికైనా పథకాలు సక్రమంగా అందించడంపై దృష్టి పెడితే బాగుంటుందని హితవు పలికారు.

ఏడాది పాలనలో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న నక్క తులసీదాస్ తదితరులు

సారవకోట: ఏడాది కూటమి పాలనలో ఒరిగిందేమీ లేదని డీఎల్‌డీఏ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నక్క తులసీదాస్ అన్నారు. ఆదివారం బుడితిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలన ప్రారంభమైనప్పటి నుంచి అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, మీడియాపై ఆంక్షలు, సంకెళ్లు తప్ప ప్రజలకు చేసేందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎండీఎం వాహనాల ద్వారా గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు అందించేవారని, ప్రస్తుతం లబ్ధిదారులు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం, పనసలోవ, మొదలికొత్తూరు, సవరబొంతు, గూడ తదితర గ్రామాల ప్రజలు రేషన్ సరుకుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి నిక్కు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలను నాశనం చేస్తున్నారు



మన్మథరావు

జలుమూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి పంచాయతీలను నాశనం చేస్తున్నారని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మథరావు ఆదివారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం వేరే కార్యక్రమాలకు వినియోగిస్తోందని విమర్శించారు. దీంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడడంతో పాటు కనీసం పారిశుద్ధ్య పనులు చేసేందుకు సైతం నిధులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు తల్లికి వందనం పథకానికి అనర్హులంటూ ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో పంచాయతీలను అభివృద్ధి చేస్తామని ఎన్నో వాగ్దానాలు చేసి, ఇప్పుడు పంచాయతీలను చిన్నచూపు చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.

యోగేశ్వరరావుకు సన్మానం



యోగేశ్వరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న రాధా మనోహర్ దాస్

మెళియాపుట్టి: తిరుపతిలోని కచ్చెపి ఆడిటోరియంలో మెళియాపుట్టి గ్రామానికి చెందిన దాసరి యోగేశ్వరరావుకు రాధా మనోహర్ దాస్ ఆదివారం ఘనంగా సత్కరించారు. తిరుపతిలోని అభయ హిందూ పరిషత్ స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా హిందువులను చైతన్యపరిచే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో 100 మంది వేద పండితులు పాల్గొన్న కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల కూల్చివేతలు ఆపడం, సనాతన ధర్మం, వేదాలు, పవిత్ర గ్రంథాలు గురించి యోగేశ్వరరావు వివరించడంతో అతనిని అభినందించి సత్కరించారు. దీంతో మెళియాపుట్టి గ్రామలు హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శ



శ్రీహరిని పరామర్శిస్తున్న కృష్ణదాస్ తదితరులు

సారవకోట: మండలంలోని నౌతళ సర్పంచ్ పల్లి శ్రీహరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో ఆయనను వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు వరుదు దేవీ ప్రసాద్, గెల్లంకి వెంకటరావు, యాళ్ల శ్యాముసుందరరావు, పల్లి కృష్ణారావు, కాళ్ల సింహాచలం, ఎడ్ల రంగారావు తదితరులు ఉన్నారు.

18న సర్వసభ్య సమావేశం

నరసన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ఏవో విజయానంద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ ఆరంగి మురళీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని వివరించారు. సభ్యులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

ఒడియా ఉపాధ్యాయులను నియమించాలి



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

పాతపట్నం: మండలంలోని చంగుడి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒడియా మాధ్యమంలో బోధించేందుకు ఒడియా ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం చంగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామస్తులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఒడియా, తెలుగు మాధ్యమంలో యూపీ పాఠశాలలు వేర్వేరుగా ఉండేవని, ఇప్పుడు ప్రభుత్వం తెలుగు, ఒడియా రెండు పాఠశాలలను విలీనం చేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఏర్పాటు చేసిందన్నారు. ఒడియా ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెన్నుపోటు పుస్తకావిష్కరణ నేడు

నరసన్నపేట: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆరంగి మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ హాజరవుతారని తెలిపారు. నాలుగు మండలాలకు చెందిన ప్రధాన నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరవ్వాలని కోరారు.

ప్రమాదకరం



కొత్తూరు మండలంలో ప్రధాన రహదారి మెట్టూరు సెంటర్ వద్ద అలికాం–బత్తిలి రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గొయ్యిను గుర్తించేందుకు స్థానికులు హెచ్చరికగా ఎరుపు రంగు గుడ్డను కట్టి కర్రను ఏర్పాటు చేశారు. గొయ్యి ఏర్పడిన ప్రాంతం వద్ద కల్వర్టు ఉంది. ఈ కల్వర్టు కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. అందువలన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – కొత్తూరు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సారవకోట: బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బుడితి, గుమ్మపాడు, చీడిపూడి, అవలింగి, తొగిరి, కిన్నెరవాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిర్వహణలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ జి.శంకరరావు తెలిపారు. నడగాం నుంచి సుందరాపురంల మధ్య ఈ పనులు చేపడతామన్నారు. దీంతో మంగళవారం చోడవరం ఫీడర్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: పాతపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 17వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పాతపట్నం విద్యుత్ శాఖ డీఈఈ జి.ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీలో భాగంగా కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం పనులు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు తిడ్డిమి, సవర తిడ్డిమి, చిన్నపద్మాపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏమరపాటు వద్దు



మందులు పిచికారీ చేస్తున్న రైతు

- పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- ఆదమరిస్తే ఇబ్బందులు తప్పవు
- రక్షణ చర్యలు పాటించాలి

సరుబుజ్జిలి: పంటల కాలం కావడంతో రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తుంటారు. ప్రస్తుతం వ్యవసాయం సక్రమంగా సాగాలంటే పురుగు మందులు తప్పక పిచికారీ చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అయితే పిచికారీ సమయంలో ఆదమరిస్తే కొన్నిసార్లు అస్వస్థతకు గురయ్యి ప్రాణాలుపోయే పరిస్థితులు ఎదురవుతాయి. అందువలన మందుల పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు రకాల సూచనలు చేస్తున్నారు.

పిచికారీ చేసే విధానం

★ పిచికారీ చేసే స్ప్రేయర్ నాణ్యత బాగుండాలి. ఎటువంటి లీకులు ఉండరాదు.

★ స్ప్రేయర్ నాజిల్ సక్రమంగా ఉందో లేదో ముందుగా చూసుకోవాలి. పిచికారీ సమయంలో నాజిల్ సమస్య వస్తే నోటితో ఊదకూడదు.

★ గాలి ఎక్కువగా వీచేటప్పుడు, ఎండ ఎక్కువగా తగులుతున్న సమయంలో మందులు పిచికారీ చేయరాదు.

★ పిచికారీ సమయంలో గాలికి వ్యతిరేక దిశలో స్ప్రేయర్ చేయకుండా వాలు దిశలో పిచికారీ చేయాలి.

★ మందులు కలిపిన డబ్బాల్లో నీరు పట్టుకొని తాగడం చేయకూడదు.

డబ్బాలను ఇలా భద్రపరిచాలి

★ పిచికారీ పూర్తయిన తర్వాత డబ్బాలను ఎక్కడబడితే అక్కడ పడేయకూడదు.

★ మందు డబ్బాలను కడిగి కాలువలు, నీటి కుంటల్లో పోయరాదు.

★ మందు మిగిలిన డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలు, పశువులకు దగ్గరగా ఉంచరాదు.

పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందు పిచికారీకి పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- చేతులు, కళ్లు, ముక్కు, నోరుకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి.
- తలకు టోపీ ధరించి ముఖానికి మాస్క్ వేయాలి.
- పురుగుల మందుల బాటిళ్లతో వచ్చిన సంచులను వినియోగించరాదు.
- ద్రావణాన్ని కలిపే మందు డబ్బాపై ఉన్న లేబిల్ నందు సూచించిన వివరాల ప్రకారం మందులు కలుపుకోవాలి.
- మందులు కలిపేటప్పుడు తప్పనిసరిగా కళ్లజోడు వినియోగించాలి. లేదంటే తుంపరలు కళ్లకు తగిలే ప్రమాదమున్నది.
- ద్రావణాన్ని స్ప్రేయర్ పంప్‌లో వేసే ముందు, పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్, ఖైనీ నమలకూడదు.
- మందులను ముక్కుతో వాసన చూడరాదు. భోజనానికి ముందుగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

సూచనలు చేస్తున్నాం



రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో మా సిబ్బంది ప్రతిరోజూ ఎల్ఈడీ తెరపై ఆన్‌లైన్ ద్వారా సూచనలు చేస్తున్నాం. మందుల పిచికారీ విధానానికి సంబంధించి పోస్టర్లు ఏర్పాటు చేశాం. రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– బొడ్డేపల్లి పద్మనాభం, వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఈశ్వరరావు రౌడీషీటర్లనుద్దేశించి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.